# ముళ్లకంచె

**– తిరుమలశ్రీ**

'స్త్రీజన్మ శాపమో, పాపమో తెలీదు. ఏ పుట్టకయినా పుట్టొచ్చుగాని, లోకంలో ఆడదానిగా మాత్రం పుట్టకూడదు' అనుకుంది కౌసల్య. ఆ పదేళ్లలో ఆమె అలా ఇప్పటికి ఎన్నివందల సార్లు అనుకున్నదో ఆమెకే తెలియదు.

గొప్పు తగిలినవాడికే నొప్పి తెలుస్తుంది. కావిడ మోస్తేతప్ప దాని బరువు తెలియదు.

సంసారమనే కావిడను కౌసల్య వొంటి భుజంమీద మోయడం ఆరంభించి దశాబ్దం దాటిపోయింది. సంసారమనే కావిడకు భార్యాభర్తలు రెండు భుజాలయితే– అందులో ఒకటి విరిగిపోతే.. మగభుజమే వొరిగిపోతే.. ఆడదాని ఇక్కట్లు వర్ణనాతీతం. సుడిగాలిలో చిక్కుకున్న పక్షి చందమవుతుంది. అందునా యవ్వనంలోవున్న వొంటరి స్త్రీ.

కౌసల్య యవ్వనంలోవుంది. మూడున్నర పదుల వయసు ఆమె పరువానికి, శరీరానికీ చక్కటి పదునుపెట్టింది.

పదేళ్ల క్రితం వైధవ్యమనే వైతరణిలోకి విధిచేత నిర్దయగా విదిలించబడిన అభాగ్యురాలామె.

ఆమెకు తోడు మరో నిర్భాగ్యురాలు. కూతురు సరోజ. ఇరవయ్యేళ్ల ముగ్ధ. అప్పుడే యవ్వన సౌందర్యాలు పురివిప్పుకుంటున్న స్నిగ్ధ.

సరోజ, కౌసల్యకు సవతి కూతురు. అయినా స్వంత కూతురికంటే మిన్నగా చూసుకుంటుంది ఆపిల్లను.

ఆపిల్ల తల్లి పుష్కరాలలో గోదావరిలో కలిసిపోతే, ఏడాది తిరక్కుండానే కౌసల్యను పెళ్లాడాడు తండ్రి కేశవరావు. తనకంటే పదేళ్లు పెద్దవాడయిన ఓ మగాడికి భార్యగానేకాక, అయిదేళ్ల పసిపాపకు తల్లిగా ఆ ఇంట అడుగు పెట్టింది కౌసల్య.

కేశవరావు కౌసల్యను ప్రేమగా చూసుకునేవాడు. అంతకంటే ప్రేమగా సరోజను చూసుకునేది కౌసల్య. ఆపిల్ల కూడా కౌసల్య ప్రేమానురాగాలలో కరిగిపోయి కన్నతల్లిని మరిచిపోయింది. ఎవరెన్ని చెప్పినా, 'పిన్ని' అనికాక కౌసల్యను 'అమ్మా' అనే పిలిచేది.

"ఏమండీ! సరోజ నా ప్రాణం. మనుషుల మనసులు పూసరవెల్లుల్లాంటివి. ఎప్పుడెలా మారతాయో తెలీదు. నాకంటూ సంతానం కలిగితే నాలో స్వార్థం పెరగవచ్చును. సరోజకు అన్యాయం జరగవచ్చును. అందుకే మనకిక పిల్లలు వద్దండీ!" అన్న భార్యవంక మొదట తెల్లబోయి చూసినా, ఆ తరువాత ఆమె త్యాగనిరతికి నిరుత్తరుడే అయ్యాడు కేశవరావు. ఆమెపట్ల ప్రేమానురాగాలు రెట్టింపయ్యాయి అతనిలో.

కేశవరావు త్రాగుడుకు బానిస. అదే అతని ప్రాణం తీసింది. త్రాగిన మత్తులో యాక్సిడెంటు చేసి అక్కడికక్కడే మరణించాడు.

ఆ అశనిపాతాన్ని తట్టుకోవడం అనుకున్నంత సులభం కాదు, కౌసల్య స్థితిలోవున్న ఎవరికైనా.. అప్పటికింకా పాతికేళ్ల పిల్లే తాను. పదేళ్ల కూతుర్ని కావలించుకుని భోరున ఏడ్చింది. పోయినోళ్లంతా అదృష్టవంతులే! మిగిలున్నోళ్లే దురదృష్టవంతులు. ఆ ఫలితాన్ని జీవితాంతమూ అనుభవించితీరాలి.

అదిగో, అప్పుడే అనుకుంది కౌసల్య మొదటిసారిగా– 'ఆడజన్మ శాపగ్రస్తమని!'

విధాతపైన విపరీతమైన ఆగ్రహం కలిగిందామెకు. తన 'రాత'పైన అలా వాతలు పెట్టినందుకు కాదు. జీవితమంటే ఎరుగని ఆ పసిదాని బ్రతుకును నుసిపాలు చేసినందుకు. అయిదేళ్ల వయసులోనే కన్నతల్లిని పోగొట్టుకున్న అభాగ్యురాలు సరోజ. పదేళ్ల వయసులో తండ్రిని కూడా కోల్పోయి నిర్భాగ్యురాలయింది. అంతటి ఘోరమైన శిక్ష.. ఆ వయసులో.. విధి క్రూరత్వంకాక మరేమిటి? తల్లిదండ్రుల ప్రేమానురాగాలను పంచుకునేందుకు నోచుకోని జీవితాన్ని భగవంతుడు ఆ పిల్లకు ఎందుకు ప్రసాదించాలి? పైగా, ఆడపిల్ల కూడానాయె! ముందు ముందు మరెన్ని ఇక్కట్లకు గురికావలసి వుంటుందోనన్న భావనే కౌసల్య మదిని మరింత కలచివేసింది.

మంచినీ, చెడునూ నిమిత్తమాత్రంగా మోసుకొచ్చే పోస్ట్‌మాన్– కాలం. అది ఎవరికోసమూ ఆగదు. విధి నిర్వహణలో నిర్విరామంగా పరుగులు పెడుతూనే వుంటుంది. ఆనందంకాని, దుఃఖంకాని కలకాలం నిలవవు. అది మానవుడికి దేవుడిచ్చిన వరం!

కౌసల్యను కన్నవారు కడుపులో పెట్టుకుంటామన్నారు. తనకైతే కన్నవారున్నారు. సరోజకు ఎవరున్నారు? కనకపోయినా ఆపిల్ల భారాన్ని మోయవలసింది తానే. పూలపల్లకిలో పెట్టి వూరేగించే శక్తి, సామర్థ్యమూ తనకు లేకపోవచ్చును. కనీసం కావడిలోనయినా కూర్చోబెట్టి మోయవలసిన బాధ్యత తనమీద వుంది. తన కన్నవారి సంగతి తనకు బాగా ఎరుకే. ఆది నుంచే ఆ పిల్లను పరాయిదానిలా చూసేవారు. ఇప్పుడు వారి పంచను చేరితే సరోజ స్థితి ఎలా వుంటుందో వూహించగలదు తాను.

అందుకే తల్లిదండ్రుల ప్రతిపాదనను సున్నితంగా త్రోసిపుచ్చింది కౌసల్య. సరోజ తన కూతురు. ఆ సంసారం తనది. తనమీద ఎంతటి విశ్వాసం లేకుంటే ఆ పసిదాన్ని తనకు అప్పగించి మాటమాత్రమైనా చెప్పకుండా నిశ్చింతగా వెళ్లిపోతాడు భర్త?

కష్టమైనా, నష్టమైనా తనకే! ఇతరులను పంచుకోమనడం భావ్యంకాదు. పెళ్లయిననాడే స్త్రీ పుట్టింటికి చుట్టమవుతుంది. చుట్టం చూరుపట్టుకుని వ్రేలాడకూడదు.

గుండె రాయి చేసుకుంది కౌసల్య. పసిదాన్ని గుండెల్లో దాచుకుంది– గుడ్లు తెరవని పసికందును రెక్కల్లో దాచుకునే గువ్వలా.

భర్త అమర్చిన స్వంత ఇల్లు వుండనేవుంది. ఆ పాత ఇంటిని బాగుచేయించి రెండు వాటాలుగా కేటాయించింది. ఒక వాటాను అద్దెకిచ్చింది. పెద్దమనుషుల ద్వారా వాయిదాల పద్ధతిన కుట్టుమిషను సంపాదించింది.

పెళ్లికాకముందు స్నేహితురాళ్లతో కలిసి టైలరింగ్ క్లాసులకు వెళుతూండేది తాను. అలా నేర్చుకున్న విద్య వృథా కాకూడదని కుట్టుమిషన్ ఒకటి కొనిపెట్టమని ఒకసారి భర్తను అడిగింది. 'నేను జీవించివుండగా నా భార్య మిషన్ కుట్టుకోవడమా?' అంటూ కొట్టిపడేసాడతను.

ఇప్పుడతను జీవించిలేడు. తామిద్దరూ ఇంకా జీవించవలసివుంది. అందుకే చేతనయిన పనికి పూనుకుంది. ఆనాడు సరదాగా నేర్చుకున్నది ఈనాడు జీవనాధారమయినందుకు సంతోషించాలో, విచారించాలో తెలియలేదు. ఎవరేమనుకున్నా పట్టించుకోలేదు. ఇంట్లోనే మిషన్ పెట్టుకుని తెలిసినవారి దుస్తులు కుట్టడంతో ఆరంభించింది.

సరోజ చదువును ఆపలేదామె. తన చదువు ఎలిమెంటరీ స్కూలు దాటలేదు. తన కూతురు కనీసం హైస్కూలయినా దాటాలి. స్త్రీ దుర్బలత్వాలలో విద్యలేమి ఒకటి అని లోగడ ఏదో పత్రికలో చదివింది తాను. ఆ దుర్బలత్వం సరోజకు అంటకూడదు అనుకుంది.

సరోజ కూడా తల్లి అదుపాజ్ఞలలో మెలగుతూ జాగ్రత్తగా మసలుకుంటోంది. వయసు పెరిగేకొద్దీ, జ్ఞానం వృద్ధి అవుతున్నకొద్దీ కౌసల్య తనకోసం పడుతూన్న శ్రమ, చేస్తున్న త్యాగం మరింతగా ఆకళింపు కాజొచ్చాయి. ఆ పిల్లకు ఆమెపైన భక్తి గౌరవాలు ఇనుమడించాయి. బుద్ధిగా చదువుకుని స్కూలు ఫైనలు మంచి మార్కులతో పాసయింది. ఆ వూళ్లో కాలేజీలేదు. పొరుగూరికి పంపించి కూతుర్ని పైచదువులు చదివించాలని వువ్విళ్లూరింది కౌసల్య. ఆ విషయంలో మాత్రం సరోజ ఒప్పుకోలేదు. అన్నేళ్లూ తనకోసం తల్లి ఎంతో శ్రమించింది. కాలేజీ చదువులంటే తలకు మించిన భారం. అందుకే ఇంట్లోనే వుండి కుట్టుపనిలో తల్లికి సాయపడాలని నిశ్చయించుకుంది. ఇరుగు పొరుగులు కూడా ఆ పిల్లనే సమర్థించడంతో ఇంకేమీ అనలేకపోయింది కౌసల్య.

ఇంతవరకూ కొంత బాధ్యత తీర్చుకుంది తాను. పిల్లను పెంచి పెద్దచేసింది. ఎంతో కొంత చదువు కూడా చెప్పించింది. ఇక దాన్ని ఓ అయ్యచేతిలో పెట్టేస్తే తన బాధ్యత పూర్తవుతుంది. సరోజ కూడా పరువం తెచ్చిన అందాలతో చందనపు బొమ్మలా వుంటుంది. కనుక కట్నాల బెడద పెద్దగా వుండకపోవచ్చు ననుకుంది. తగిన సంబంధాల కోసం ఆరాటం ఆరంభమయింది.

ఆ సమయంలోనే ఆ వూరికి వచ్చాడు రామకృష్ణ.

కౌసల్య ఇంట్లో అద్దెకు దిగిన యువకుడతను. ముప్పయ్ ఏళ్ళుంటాయి. ఎలిజిబుల్ బ్యాచ్‌లర్.

అంతవరకు అద్దెకున్న వాళ్లు ఖాళీచేసి వెళ్లిపోవడంతో ఆ వూరికి కొత్తగా వచ్చిన రామకృష్ణకు ఆ వాటా అద్దెకిచ్చింది కౌసల్య. ఆ వూరి పంచాయితీ ఆఫీసులో గుమస్తాగా వచ్చాడతను. అదే మొదటి పోస్టింగు. చూపులకు నదరుగా వుండడమేకాక, బుద్ధిమంతుడిలా కనిపించాడు.

కౌసల్య తెగువకలదే కాదు, తెలివైనది కూడాను. ఆ కుర్రాడికి గది అద్దెకిచ్చేముందే అతని గురించి ఆరా తీసింది. ముప్పయ్యేళ్ళు. పెళ్ళికాలేదింకా. పైగా తమ కులపువాడునని తెలుసుకుంది. వయసొచ్చిన ఆడపిల్లలున్న వారు బ్రహ్మచారులకు గది అద్దెకివ్వడానికి సిద్ధపడరు సాధారణంగా. అది వారి మీద అనుమానమో.. తమ పిల్లలపైన అవిశ్వాసమో.. లేక, ఆ వయసుపట్ల వున్న దురభిప్రాయమో తెలీదు. వారి భయాలు వారివి. రామకృష్ణకు కూడా అటువంటి అనుభవమే అయింది ఆ వూళ్లో... 'నీ కూతురు వయసొచ్చిన పిల్ల. పైగా యవ్వనంలోవున్న ఒంటరి ఆడంగులు మీరు. ముక్కూ, మొగమూ ఎరుగని పొరుగూరి బ్రహ్మచారి కుర్రాడికి గది ఇవ్వడం మంచిదికాదు' అంటూ కౌసల్యను కూడా హెచ్చరించారు కొందరు. కౌసల్య వారి సలహాలను ఆలకించిందే తప్ప ఆచరణలో పెట్టలేదు. 'మన బంగారం మంచిదయితే కంసాలివాడు ఏం చేయగలడు?' అని జవాబిచ్చింది. 'నా బంగారం మంచిదే!' అనుకుంది.

రామకృష్ణ బుద్ధిమంతుడే. అతను గదిలోవున్న జాడే తెలియదు. తల్లీకూతుళ్లు ఎదుటపడినా తల వంచుకుని వెళ్లిపోయేవాడు. తన వుద్యోగమేమిటో, తానేమిటోగా వుండేవాడు.

కౌసల్యకు భర్త బ్రతికుండగా వయసుకు తగ్గ కోరికలేవైనా వున్నా, అవన్నీ అతనితోటే సమాధి అయిపోయాయి. ఇప్పుడు ఆమె ధ్యాసంతా సరోజను వృద్ధిలోకి తీసుకురావాలన్నదే. బాల్యం నుంచీ జీవితంలో చేదునే చవిచూసిన ఆ పిల్లకు భావిజీవితం బంగారుమయం చేయాలన్న తపన. అనువైన సంబంధం చూసి పెళ్లి జరిపించేస్తే తనకు తృప్తీ, ఆపిల్లను కన్నవారి ఆత్మలకు శాంతీ లభిస్తుందన్న ఆరాటం. అందుకే రామకృష్ణకు గది అద్దెకివ్వడంతోటే ఆగిపోలేదామె. మరో అడుగు ముందుకు వేసింది.

ఆ కుర్రాడికి వెనుకా ముందూ ఎవరూ లేరనీ, అనాథాశ్రమంలో పెరిగి పెద్దవాడయ్యాడనీ ఆలకించడంతో అతని మీద సానుభూతీ, తన కూతురికి అందుబాటులో వుంటాడన్న ఆశా- రెండూ కలిగాయి ఆమెలో.

అయితే ఎదురింటి వెచ్చాలకొట్టు రంగయ్య ఆమధ్య ఆకుర్రాణ్ణి తరచు తన ఇంటికి పిలుచుకుంటున్నాడనీ, అతన్ని మొహమాటపెట్టి తన కొట్లోని సరుకులను చవకగా ఇస్తున్నాడనీ తెలియడంతో కంగారుపడింది కౌసల్య. కారణం- రంగయ్యకు పెళ్లికెదిగిన కూతురుంది. పేరు రమ. పాతికేళ్లు వచ్చినా ఆపిల్లకింకా పెళ్లికాలేదు. రమ, సరోజ అంతటి అందగత్తె కాకపోయినా రామకృష్ణకు, రమకు వయసు జోడీ సరిపోతుంది. సరోజకు, అతనికీ పదేళ్ల తేడావుంది.

ఓరోజు రాత్రి తలుపుచాటున నిలుచుని రామకృష్ణతో అంది కౌసల్య- ''సరోజ టెన్త్ పాసయింది. ప్రయివేట్‌గా డిగ్రీ చదవాలనుకుంటోంది. ప్రవేశ పరీక్ష రాయాలట. మీరేమీ అనుకోనంటే దానిని కాస్త పరీక్షకు తయారుచేయగలరా?''

''డిగ్రీ చదవాలని నేనెప్పుడనుకున్నాను?'' అంటున్న కూతురి నోరు నొక్కేసింది.

కాదనలేదు రామకృష్ణ. ఆ తల్లీకూతుళ్ల మీద విపరీతమైన సానుభూతి వుంది అతనికి. ఎనలేని గౌరవాభిమానాలూ వున్నాయి.

పంచాయితీ ఆఫీసులో పని ఎక్కువగా వున్న కారణంగా అతను ,ఇంటికి చేరుకునేసరికి బాగా ప్రొద్దుపోతుంది రోజూ. అతను వచ్చేవేళకు వేడి వేడిగా కాఫీ కప్పుతో కూతుర్ని పంపుతుంది కౌసల్య. రామకృష్ణకది ఇబ్బందిగానే వుంది. అవస్థలు పడుతూ కుటుంబం నెట్టుకొస్తున్న ఆడంగులు వాళ్లు. ఎప్పుడో ఒకసారయితే పరవాలేదు. దైనందిక కార్యక్రమంగా కాఫీ త్రాగుతూంటే వారి కష్టాన్ని జుర్రుకుంటున్నట్టే అనిపిస్తోందతనికి. వద్దంటే మానడం లేదు.

''అమ్మ నిర్ణయానికి తిరుగులేదు. మీ మాస్టారు పగలంతా ఆఫీసులో అలసిపోయి వస్తారు. కనీసం కాఫీ అయినా త్రాగకపోతే నీకు చదువెలా చెబుతారనుకున్నావ్ అంటూ తిడుతోంది. మీరు కాదనకండి'' అంది సరోజ ఒకసారి అతనితో.

ఆ మాటలు కౌసల్య ఆలకించింది. ట్యూషన్ ముగించుకుని వచ్చాక కూతుర్ని బాగా చీవాట్లు వేసింది-

''కాఫీ అమ్మ పంపించిందని చెబుతావేమే పిచ్చిమొద్దూ? అతనికోసం నువ్వే స్వయంగా తయారుచేసి తెచ్చావని చెప్పాలి'' అంటూ.

''అలా అబద్ధం ఎందుకు చెప్పాలే అమ్మా?'' అని అమాయకంగా అడిగిన కూతుర్ని చూసి అరచేత్తో నుదురు బాదుకుందామె.

''ఇక నీకు తెలివితేటలు ఎప్పుడు అబ్బుతాయే?'' అంది.

''ఎందుకూ?'' అనడిగింది సరోజ సాగదీస్తూ.

'ఎందుకూ?' అంటే, ఏమనిచెబుతుంది తాను? ఎదిగొచ్చిన కూతురికి పరాయి మగవాణ్ణి ఎలా ఆకర్షించుకోవాలో ఏ తల్లిగాని సూటిగా ఎలా చెప్పగలుగుతుంది? 'ఆమాత్రం అర్థం చేసుకునే తెలివితేటలు లేకపోతే ఈపిల్ల జీవితంలో ఎలా రాణిస్తుంది దేవుడా?' అనుకుని బెంగపడిపోయింది.


''అతను మనవాళ్లేనట. అందుకే నువ్వు కాస్త.. కాస్త..'' ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియలేదు.

'ఛీ! ఆడబ్రతుకంతటి అధ్వాన్నం మరోటిలేదు!' అనుకుంది మళ్లీ.

ఆమధ్య గదిలోంచి రామకృష్ణవీ, సరోజవీ నవ్వులవీ వినిపిస్తుంటే, 'పరవాలేదు. దారిలో పడుతున్నారు' అనుకుని తేలికగా వూపిరి పీల్చుకుంది కౌసల్య.

కాని- ఉన్నట్టుండి పిడుగులాంటి వార్త చెవిలో పడింది ఓరోజున... 'వీధి చివర ఇడ్లీలమ్ముకునే వెంకాయమ్మ వూరినుంచి చెల్లెల్ని రప్పించిందట. ఆ పిల్లను రామకృష్ణ





## అర్ధరాత్రి పూలు పెట్టుకుంటే...

అర్ధరాత్రి వేళ నిద్రలేచి తలలో ఏడు పువ్వులు పెట్టుకుంటే ఆ కన్య కోరిక ఈడేరుతుందన్న వింత నమ్మకం స్వీడన్ కన్యల్లో ప్రబలివుంది. తమకు పెళ్లి కావాలన్న కోరికతో కన్యలు ఇలా అర్ధ రాత్రి లేచి తలలో ఏడు పువ్వులు ధరిస్తారు. ఈ ఆచారం స్వీడన్‌లోని కొన్నితెగలలో ఇప్పటికీ కొన సాగుతూనే వుంది.

## పిల్లి తోక తొక్కితే!

పిల్లి తోక తొక్కితే పెళ్లి రద్దయ్యే ఆచారం ఫ్రాన్స్ దేశంలో వుంది. పెళ్లీడుకొచ్చిన యువతీ యువ కులు పిల్లి తోక తొక్కటం జరిగితే అది అశుభ సూచకంగా భావిస్తారు ఫ్రాన్స్‌లోని కొన్నితెగల ప్రజలు. ఈ వింత ఆచారం ఎంత తీవ్రంగా అక్కడ ప్రాకిపోయిందంటే పొరపాటున పిల్లి తోక తొక్కినట్లు తెలిస్తే కనీసం ఒక సంవత్సర కాలం పాటు వధువు లేక వరుడు తమ పెళ్లి ప్రయత్నాలు రద్దు చేసుకుంటారు!

-శ్రీకొండ

## ఇది మీకు తెలుసా?

★ ఎలుక నీళ్లు త్రాగకుండా ఒంటె కంటే ఎక్కువ కాలం జీవించగలదు.

★ ఒంటె వెన్నెముక వంకర లేకుండా నిటారుగా వుంటుంది.

★ బ్లేడు అంచుమీద నడిచినా నత్తకు గాయం కాదు.

★ ఇంగ్లీషు భాషలో 'ఇ' అక్షరం మిక్కిలి ఎక్కువగాను, 'క్యూ' అక్షరం తక్కువగాను ఉపయోగప డతాయి.

-ముద్దా రమణమూర్తి

కిచ్చి పెళ్లి చేయాలన్న ప్రయత్నమట!'

ఇరుగమ్మ మోసుకొచ్చిన ఆ వార్తతో హతాశురాలయింది కౌసల్య. హఠాత్తుగా ఆవూళ్లోని పెళ్లికాని ఆడపిల్లలంతా రామకృష్ణపైన వలవేస్తున్నట్టు తెగబాధపడిపోయింది. అతను తనచేయి జారిపోతున్నాడని బెంగపడిపోయింది.

ఆమధ్య రామకృష్ణ, సరోజల మధ్య చనువు పెరగడం తాను గమనిస్తోంది. వీలయినపుడల్లా పొలాలు, తోటల వైపు షికార్లకు కూడా వెళ్తున్నారు జంటగా. ఆ విష యంలో ఒకరిద్దరు తనను హెచ్చరించబోయారు కూడాను.

రామకృష్ణవంటి యువకుణ్ణి అల్లుడుగా చేసుకోవాలను కోవడం అసహజంకాదు. కాని, తన మార్గానికి అడ్డురావ డమే సహింపరానిది. చంటిపాప చేతిలోని తాయిలాన్ని గ్రద్ద తన్నుకుపోయినట్టు, వేరెవరూ రామకృష్ణను ఎగరేసు కుపోకముందే తాను త్వరపడాలనుకుందామె.


ఆరోజు సరోజ పెళ్లి విషయం రామకృష్ణతో కదపాలని నిశ్చయించుకుంది కౌసల్య. క్యాలెండరు చూసింది. తిధి, వారాలు కూడా అనుకూలంగానే కనిపించాయి. సెలవు రోజు కావడంతో సాయంత్రం షికారుకి వెళ్లారు ఆ ఇద్దరూ. ఆ రాత్రికి అతని భోజనం తమతోనేనని చెప్పించి బలవంతంగా వొప్పించింది.

చీకటిపడ్డాక ఇంటికి చేరుకున్నారు రామకృష్ణ సరో జలు. వస్తూనే ఎందుకో పెద్దగా నవ్వుకుంటూ వచ్చారు. కూతురివంక పరీక్షగా చూసింది కౌసల్య. ఆమె వదనంలో ఏదో నూతనోత్తేజం గోచరిస్తున్నట్లనిపించింది. ఆమధ్య కూతురిలో చలాకీతనం పెరగడం గమనించింది. తాను వేసిన నారు జీవం పోసుకుంటోందన్న ఆశకు ఆ ఇద్దరి ప్రవర్తనా నీరు పోస్తోంది.

లోపలికి వస్తూనే, ''అమ్మా! మాస్టారు ఇవాళ నీతో ఏదో ముఖ్యమైన విషయం మాట్లాడాలట'' అన్న సరోజ పలు కులు వినగానే కౌసల్య గుండె వేగం పుంజుకుంది.

'ఏమిటో ఆ ముఖ్యవిషయం? నేను అనుకుంటున్నదే కాదుగదా? అదే అయితే మంచిదే! ఆడదాన్ని-విషయం ఎలా కదపాలా అని కొట్టుమిట్టాడుతున్నాను. అతనంతట అతనే అడిగితే అంతకంటే ఏం కావాలి?' అనుకుంది మనసులో. పైకి మాత్రం, ''భోంచేశాక మాట్లాడుకోవచ్చును. ముందు కాళ్లు కడుక్కోవడానికి నీళ్లియ్యి'' అంది.

అతనికి భోజనం వడ్డించి తాను తలుపుచాటునే వుండి పోయింది కౌసల్య. సరోజ వడ్డిస్తోంది. అతను మొహమా టపడుతూంటే కొసరి కొసరి తినిపిస్తూ ఆటపట్టిస్తోంది.




అతను కూడా చాలా ఫ్రీగా ఆ పిల్లతో వేళా కోళమాడుతున్నాడు.

'మంచి చక్కటి జంట!' అనుకుని మురిసిపోయింది కౌసల్య. 'దేవుడా! నాకోరిక నెరవేర్చినం దుకు నీకు కోటి దండాలు!' అని దేవు డిక్కూడా మొక్కు కుంది మదిలోనే.

భోజనాలు కాగానే రామకృష్ణనుద్దేశించి, ''ఏదో మాట్లాడాలన్నారట'' అంది కౌసల్య తలుపుచాటునుంచే.

''ఔనండీ'' అన్నాడేకాని, ఆ తరువాత అతని నోట మాట పెకల్లేదు.

''ఇద్దరి మధ్యా నిశ్శబ్దం. కొద్దిక్షణాలపాటే అయినా యుగాలుగా అనిపించిందామెకు. ఆత్రుతతో, ఆందోళ నతో ఆమె గుండె ఆగిపోయేటట్టుంది.

ఎట్టకేలకు నోరువిప్పాడతను. ''ఈ విషయం ఎలా ప్రస్తావించాలో నాకు తెలియదు. అయినా నా మనసు లోని మాటను సూటిగా చెప్పేస్తున్నాను...'' అన్నాడు.

'వచ్చేస్తోంది. తాను ఎదురుచూసిన క్షణం వచ్చేస్తోంది. తన వూహ నిజమయింది. తన బంగారుకలలు, అంతవ రకు తాను పడిన తపనా ఫలించబోతున్నాయి...' అను కుంటూ, అతను చెప్పబోయేది వినడానికి వూపిరి బిగబ ట్టిందామె.

''మీ కుటుంబం గురించి అంతా తెలుసుకున్నాను. చిన్న వయసులోనే మీకు వచ్చిన కష్టమూ, సరోజ కోసం మీరు చేసిన త్యాగమూ ఆలకించాను. సరోజ మీ పంచ ప్రాణాలూనని గ్రహించాను. సరోజంటే నాకెంతో ఇష్టం. అందమైనది, తెలివైన పిల్ల. మీ పెంపకంలో చక్కటి క్రమ శిక్షణ నేర్చుకుంది...'' అన్నాడతను. ''కౌసల్యగారూ! సరోజకు నేను ఏలోటూ రానివ్వను. ఆమెను మీకంటే ప్రేమగా, ప్రాణప్రదంగా చూసుకుంటానని హామీ ఇస్తు న్నాను..'' ఆగాడతను.

అమృతపు సోనల్లాంటి అతని పలుకులు వీనుల విందు చేయడంతో గుండెల నిండా హాయిగా వూపిరి పీల్చుకుం దామె. ఆనందంతో శరీరం గాలిలో తేలిపోతున్నట్లు అను భూతి చెందింది.

''మీరు 'వూ' అంటే..'' ఆపైన అతను అన్నమాట ఆలకించగానే అదిరిపడింది కౌసల్య. బిత్తరపాటుతో తలు పుచాటునుంచి చటుక్కున అతని ఎదుటకొచ్చి నిలు చుంది.

''మన ఇద్దరి వయసులలోవున్న తేడా గురించి ఆలో చించవద్దు. వయసులకంటే మనసులు ముఖ్యం..'' అంటున్నాడతను. అతని పలుకులు ఆమె బుర్రలో దూరడం మానేసాయి. ఎందుకంటే, అది ఎప్పుడో మొద్దు బారిపోయింది.

''ఏమంటారు?'' తన అభిప్రాయం అడుగుతున్నాడ తను.

'ఏమని చెబుతుంది? తాను ఆశించినదేమిటి? అతను అడుగుతున్నదేమిటి?'

తెలిసో తెలియకో 'బ్రహ్మచారి' అనే 'ముళ్లకంచె'పైన 'కూతురనే' తడిబట్టను ఆరవేయబోయింది తను. ఆ ప్రహసనంలో తన చీరె ముళ్లకు చిక్కుకుంది. జాగ్రత్తగా విడిపించుకోవాలి దాన్ని. లేకుంటే...

''ఔనండీ. మీకుటుంబంపైన సానుభూతితోగాని, తొందరపాటుతోగాని మాట్లాడడంలేదు నేను. ఎన్నో రోజులు బాగా ఆలోచించుకునే ఈ నిర్ణయానికి వచ్చాను. జీవితంలో ప్రేమకు నోచుకోని నేను, ప్రేమలో పడ్డాను.. సరోజ అభిప్రాయం కూడా అడిగాను. ఇష్టమేనని చెప్పిం ది...'' చెప్పుకుపోతున్నాడు రామకృష్ణ. ''మీకు అభ్యం తరం లేకపోతే.. నేను మిమ్మల్ని వివాహమాడతాను...''

★